క్లుప్తంగా

అనుమతిలేని టపాసులు విక్రయిస్తే చర్యలు



క్రష్ట షాపును తనిఖీ చేస్తున్న ఎస్ఐ నరసింహులు

ఆలూరు: అనుమతిలేని టపాసులు విక్రయిస్తే సంబంధిత షాపుల నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని ఆలూరు ఎస్ఐ సీవీ నరసింహులు హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం రాత్రి మండల కేంద్రం ఆలూరులో టపాసు విక్రయించే షాపులను ఎస్ఐ తనిఖీ చేశారు. స్టాక్ వివరాలు, అనుమతులకు సంబంధించిన రికార్డులను ఎస్ఐ పరిశీలించారు.

ప్రతి ఇంట్లో జ్ఞాన జ్యోతులు వెలిగించాలి

కృష్ణగిరి: దీపావళి పండగ రోజున ప్రతి ఇంటిలో జ్ఞాన జ్యోతులు వెలిగించాలని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి- ఇందూ జ్ఞాన వేదిక డోన్ కమిటీ సభ్యులు నాగార్జున కోరారు. మండల పరిధిలోని బాపనదొడ్డి గ్రామంలో మంగళవారం సమితి సభ్యులతో కలిసి భగవద్గీతపై ప్రచారం చేశారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు నాగేంద్ర, సుబ్బయ్య, శివకుమార్, సుంకన్న, శేషు, శ్రీరాములు, శశికళ తదితరులు పాల్గొన్నారు.

పి.కోటకొండలో 'పొలం పిలుస్తోంది'



రైతులకు సూచనలు ఇస్తున్న ఏఓ సురేష్‌బాబు

దేవనకొండ: మండలంలోని పి.కోటకొండ గ్రామంలో మంగళవారం ఏఓ సురేష్‌బాబు 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. రైతులకు నూతన వ్యవసాయ పద్ధతులను ఏఓ వివరించారు. పంటలను చీడపీడలు ఆశించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు అబ్దుల్‌సలాం, మల్లికార్జున, వీపీఏలు బీమన్న, వీహెచ్‌ఏ లింగేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

కురువెల్లిలో గ్రామసభ



మాట్లాడుతున్న తహసీల్దార్ గోవింద్ సింగ్

ఆలూరు: మండల పరిధిలోని కురువెల్లిలో మంగళవారం సర్పంచ్ ఉప్పర రవి ఆధ్వర్యంలో తహసీల్దార్ గోవింద్ సింగ్ రీ సర్వే భూ సమస్యలపై గ్రామ సభ నిర్వహించారు. రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన తహసీల్దార్ పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వీఆర్వోలు, సర్వేయర్లు, గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తుగ్గలి : రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఖోఖో పోటీలకు తుగ్గలి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు సంధ్యానాయక్ మంగళవారం తెలిపారు. అండర్-14 విభాగంలో రంజిత్, సమీరా, అండర్- 17 విభాగంలో అరుణ్‌కుమార్ జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వచ్చే నెలలో పల్నాడు జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం బాబురావు, వ్యాయామ ఉపాధ్యాయుడు, ఉపాధ్యాయులు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

యూటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

కృష్ణగిరి: కృష్ణగిరి మండల శాఖ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా నాగరాజు, దుర్గాప్రసాద్‌లను ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి హేమంత్‌కుమార్ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన యూటీఎఫ్ మండల స్వర్ణోత్సవ సభలో ఈ ఎన్నికల ప్రక్రియ జరిగింది. స్వర్ణోత్సవ సభకు సంఘం రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్‌కుమార్, సాహితీ స్రవంతి, రాష్ట్ర అధ్యక్షులు మోహన్, జిల్లా కార్యదర్శులు లక్ష్మీదేవి, దుర్గాప్రసాద్ హాజరయ్యారు. అనంతరం సంఘం సహాధ్యక్షులుగా రాజ్‌కుమార్, హసీనా బేగం, ఆర్థిక కార్యదర్శిగా సురేష్, కౌన్సిలర్‌గా తాయప్ప రాములు, శివప్రసాద్‌రెడ్డి, సాంస్కృతిక విభాగం కన్వీనర్‌గా అయ్యన్న, కార్యదర్శిగా మయూరితోపాటు మరో 15 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నికున్నారు.

పల్లె.. డిజిటల్ పే

- గ్రామాలకు విస్తరించిన యూపీఐ ఆన్‌లైన్ పేమెంట్లు
- నియోజకవర్గంలో 9 వేలకుపైగా చిరు వ్యాపారులు
- 50 శాతం పైగా డిజిటల్ చెల్లింపులే
- చిల్లర సమస్యకు చెక్



చిల్లర కొట్టులో ఏర్పాటు చేసిన డిజిటల్ పేమెంట్ క్యూఆర్ కోడ్

కృష్ణగిరి: గతంలో పెద్ద పెద్ద వ్యాపార సంస్థలు, మాల్స్‌కే పరిమితమైన డిజిటల్ పేమెంట్లు ఇప్పుడు రోడ్డు పక్కన ఉన్న దుకాణాలతో పాటు మారుమూల గ్రామాల్లోని చిన్న చిన్న దుకాణాల చెంతకూ వచ్చేశాయి. ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం, భారత్‌పే తదితర క్యూఆర్ కోడ్ స్కానర్ లేకుండా ఏ వ్యాపారీ కనిపించడం లేదు.

కోవిడ్‌తో భారీ మార్పులు

దేశంలో 2016లో పెద్ద నోట్లను రద్దు చేశారు. అనంతరం ఆర్థిక లావాదేవీల పేమెంట్లను ప్రోత్సహించారు. అయితే అప్పట్లో అవి పెద్ద వ్యాపార సంస్థలకే పరిమితమయ్యాయి. కొన్ని అపోహల కారణంగా స్మార్ట్ చెల్లింపులు గ్రామీణ ప్రాంతాలకు చేరలేదు. కోవిడ్ అనంతరం పరిణామాలతో నగదు రహిత లావాలదేవీలు గణనీయంగా పెరిగి చెల్లింపుల్లో మార్పులు వచ్చాయి. పేమెంట్ యాప్‌లతో అన్ని చోట్లా ఆన్‌లైన్ చెల్లింపులు పెరిగాయి. కిరాణా, ఫ్యాన్సీ, మందులు, పెట్రోల్ బంకులు, ఆర్టీసీ బస్సులు, నిత్యావసర వస్తువులు తదితర దుకాణాల్లో ఆర్థిక లావాదేవీలు ఈ యాప్‌ల ద్వారానే జరుగుతున్నాయి.

నియోజకవర్గంలో 9 వేలకుపైగా దుకాణాలు

ప్రస్తుతం క్యూఆర్ కోడ్‌లు చిరువ్యాపారులకు సైతం అంటుబాటులోకి వచ్చాయి. డిజిటల్ లావాదేవీలు పెరగడంతో థర్డ్ పార్టీ నిర్వహకులు అన్ని దుకాణాల వద్దకు వెళ్లి పేమెంట్ క్యూఆర్ కోడ్లు, స్పీకర్లు పెడుతున్నారు. పత్తికొండ నియోజకవర్గంలో చిల్లర, టీ అంగళ్లు, తోపుడు బండ్లు, ఇస్త్రీ దుకాణాలు వంటివి దాదాపుగా 9 వేలకుపైగా ఉన్నాయి. వీటిలో రోజూ రూ. 3వేల నుంచి రూ.50 వేల వరకు లావాదేవీలు జరుగుతున్నాయి. వీటిల్లో 50 శాతం వరకు డిజిటల్ పేమెంట్లు జరుగుతున్నట్లు నిర్వహకులు తెలుపుతున్నారు. స్కానర్ ద్వారా చెల్లింపు సేవలు కంపెనీలు ఉచితంగా అందిస్తున్నాయి. స్పీకర్ బాక్స్ పెడితే కంపెనీలను బట్టి మినిమం చార్జీలు ఉంటాయి. ఇందుకు నెలకు రూ.120 వరకు చెల్లించాల్సి వస్తోందని వ్యాపారులు చెబుతున్నారు.

చిరు వ్యాపారుల చెంతకూ డిజిటల్ సేవలు..

టీస్టాళ్లు, రోడ్డు పక్కన హోటళ్లు, తోపుడు బండ్లు, చిరు వ్యాపారులు చేసే వారంతా ఆన్‌లైన్ చెల్లింపులను ప్రోత్సహిస్తున్నారు. దీంతో చిల్లర సమస్య ఉండడం లేదు. పేమెంట్ యాప్‌లకు సంబంధించి క్యూర్‌కోడ్‌లను ఆయా సంస్థల ఏజెంట్లు క్షణాల్లో అందజేస్తున్నారు. ఇప్పుడు ఏ దుకాణం వద్ద చూసిన స్కానర్ స్టిక్కర్ బోర్డులు కనిపిస్తున్నాయి.

చిల్లర సమస్యలు లేవు

డిజిటల్ పేమెంట్ సేవలు వచ్చినప్పటి నుంచి వ్యాపారం బాగా పెరిగింది. గతంలో చిన్న వస్తువు కొనుగోలుదారుడు కొంటే దానికి సరిపడా చిల్లరతో సమస్య ఉండేది. ఇప్పుడు ప్రతి ఒక్కరు డిజిటల్ పేమెంట్ చేస్తున్నారు. దీంతో చిల్లర సమస్య తీరడంతో పాటు వ్యాపారాలు కూడా పెరిగాయి.

– లోకేశ్వరరెడ్డి, చిరు వ్యాపారి, పెనుమాడ

స్పీకర్‌తో మోసాలకు అడ్డుకట్ట

డిజిటల్ పేమెంట్స్‌లో లాభాలతో పాటు మోసాలు కూడా ఉన్నాయి. కానీ ఈ మధ్య స్పీకర్ సిస్టమ్ రావడంతో మోసాలకు అడ్డుకట్ట పడింది. ఎక్కువ మంది ఒకేసారి వచ్చినప్పుడు డిజిటల్ పేమెంట్స్ చేసినట్లు ఫోన్‌లో చూపితే సరే అనేవాళ్లం. తీరా రాత్రికి చూసుకుంటే డబ్బులు జమకాక ఇబ్బందులు పడ్డాం. ఇప్పుడు స్పీకర్ పెట్టడంతో చేసిన ప్రతి పైసా వెంటనే తెలుగులో చెబుతుంది. దీంతో అక్రమాలు జరిగే అవకాశం లేదు. ఈ పేమెంట్స్ ద్వారా వ్యాపారం కూడా పెరిగింది.

– నాగరాజు, కూరగాయల వ్యాపారి, వెల్దుర్తి

అనుమతి లేకుండా బాణాసంచా విక్రయించరాదు

మద్దికెర : మండలంలో వ్యాపారులు అనుమతి లేకుండా బాణాసంచా విక్రయించరాదని ఎస్ఐ విజయ్‌కుమార్‌నాయక్ తెలిపారు. మంగళవారం స్థానిక స్టేషన్‌లో వ్యాపారులతో మాట్లాడుతూ అధికారుల అనుమతి లేకుండా బాణాసంచా విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రజలు ప్రశాంతంగా దీపావళి వేడుకలు నిర్వహించుకోవాలన్నారు.

నియోజకవర్గంలో 2,24,016 మంది ఓటర్లు

పత్తికొండ(తుగ్గలి) : పత్తికొండ నియోజకవర్గ ఓటర్ల ముసాయిదా జాబితా(2025)ను మంగళవారం ఆర్డీఓ ఎస్ భరత్‌నాయక్ విడుదల చేశారు. పత్తికొండ నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో 257 పోలింగ్ బూత్‌లు ఉండగా, 1,11,796 మంది పురుష ఓటర్లు, 1,12,198 మంది మహిళా ఓటర్లు ఉన్నట్లు వెల్లడించారు. అదే విధంగా 22 మంది థర్డ్ జెండర్స్ ఉన్నట్లు ప్రకటించారు.

పత్తికొండ మండలంలో 838 మంది, మద్దికెర మండలంలో 477 మంది పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. కొత్త ఓట్లను చేర్చడంతో పాటు, చనిపోయిన వారు, డబుల్ ఓట్లు కలిగిన వారిని తొలగించి జాబితా వెల్లడించినట్లు చెప్పారు.

ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



ఆస్పరి అంబేడ్కర్ సర్కిల్లో మానవహారంగా నిలిచి నరసన తెలుపుతున్న విద్యార్థులు

ఆస్పరి: ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరరం ర్యాలీగా వెళ్లి అంబేడ్కర్ సర్కిల్‌లో మానవహారంగా నిలిచి నరసన తెలిపారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు రవి, రంగప్ప, వినోద్ మాట్లాడుతూ డిగ్రీ, ఇంజినీరింగ్, బీ- ఫార్మసీ విద్యార్థులకు ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలు రూ. 3,480 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన నెలరోజుల్లోపే ఫీజురియంబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేస్తామని చెప్పి ఇంత వరకు ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. ప్రవేట్ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఫీజు చెల్లించాలని డిమాండ్ చేస్తుండడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే నవంబర్ 6వ తేదీన చలో కలెక్టరేట్ కార్యక్రమం చేపడుతామని హెచ్చరించారు.

పోరాటాలకు సిద్ధం కావాలి



పోస్టర్లు విడుదల చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

మద్దికెర : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రమైన మద్దికెరలో ఏఐఎస్ఎఫ్ జిల్లా 30వ మహాసభలకు సంబంధించి పోస్టర్లను విడుదల చేశారు. ఆదోనిలో నవంబర్ 12, 13 తేదీల్లో జరిగే మహా సభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ విద్య ప్రైవేటీకరణ, విద్యా కార్పొరేటీకరణ, విద్యా కాషాయకరణకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో తిప్పన్న, వేణు, అనిల్, జగన్, రంగన్న పాల్గొన్నారు.

మహా సభలు జయప్రదం చేయాలి

ఆస్పరి: ఆదోనిలో నవంబర్ 12,13వ తేదీలలో నిర్వహించే ఏఐఎస్ఎఫ్ జిల్లా మహా సభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శరత్‌కుమార్ పిలుపు నిచ్చారు. మంగళవారం ఆస్పరిలో మహాసభల కరపత్రాలను నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా శరత్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని భ్రష్టుపట్టిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజు, రమేష్, కార్తీక్, నవీన్, అనిల్, నల్లారెడ్డి, విద్యార్థి, విద్యార్థినీలు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణ చర్యలు చేపట్టాలి

మద్దికెర : కంది, పప్పుశనగ పంటలలో యాజమాన్య పద్ధతులు పాటించి తెగుళ్ల నుంచి కాపాడుకోవాలని ఏఓ రవి సూచించారు. మంగళవారం తెగుళ్ల నివారణపై పలు సూచనలు చేశారు. మండలంలో 12,473 ఎకరాలలో కంది పంటను సాగు చేశారన్నారు. కంది పంటను మారుక మచ్చల పురుగు ఎక్కువగా ఆశించి పంటను నాశనం చేస్తోందన్నారు. నివారణకు కార్బోసల్ఫాన్ (మార్షల్) 250 ఎంఎల్ లేదా ఎమామెక్టిన్ బెంజోయేట్ 100 గ్రాములు లామ్డాసైహలోత్రిన్ 250 ఎంఎల్ ఎకరానికి పిచికారీ చేసుకోవాలన్నారు. అదేవిధంగా కంది పూత రాలుతుంటే నివారణకు 40 మి.లీ ప్లానోఫిక్స్ మరియు బోరాన్ 250 గ్రాములు లీటర్ నీటిలో పిచికారీ చేసుకోవాలని సూచించారు. అలాగే పప్పుశనగ మండలంలో 20 వేల ఎకరాలలో సాగు చేస్తున్నారని, పంటకు ఎండవడలు ఆశిస్తుందని నివారణకు సాఫ్ 2.0 గ్రాములు లీటర్ నీటిలో కలిపి మొక్కల మొదళ్లు తడిచే విధంగా పిచికారీ చేయాలన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

కృష్ణగిరి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు కంబాలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్‌ఎం వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. అర్చరీ విభాగంలో రంగస్వామి, శ్రీహరి, అండర్-17లో కిరణ్ ఎంపికయ్యారన్నారు. అలాగే ఉషు పోటీల్లో మహేష్, డిస్కస్‌త్రో లో వెంకటేష్, రంగముని, 400 మీటర్ల పరుగు పందెంలో భావన ఐజ, హైజంప్‌లో లావణ్య, 100మీటర్ల హర్డిల్స్‌లో శ్రీహరి ఎంపికర్యారని చెప్పారు. బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో సుమన్, నెట్‌బాల్ పోటీల్లో హేమాద్రి, సంతోష్, అశోక్, కిరణ్, శ్రావణి పాల్గొంటారని తెలిపారు. విద్యార్థుల ఎంపికకు కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మయ్యను, విద్యార్థులను ఉపాధ్యాయబృందంతో కలిసి అభినందించారు.

సైన్స్‌ఫేర్‌లో గురుకుల విద్యార్థినుల ప్రతిభ



వివిధ విభాగాల్లో రాణించిన గురుకులం విద్యార్థినులతో ఉపాధ్యాయ బృందం

వెల్దుర్తి(కృష్ణగిరి): జోనల్ లెవర్ సైన్స్‌ఫేర్‌లో వెల్దుర్తి డా.బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు మూడు విభాగాల్లో రాణించి పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసూన మంగళవారం తెలిపారు. డోన్ గురుకుల పాఠశాలలో జరిగిన ఈ సైన్స్ ఫెయిర్‌లో సీనియర్స్ విభాగంలో 'గణిత పార్కు' నమూనాను దివ్యబాయ్, శ్రావణి ప్రదర్శించి రెండవ స్థానంలో నిలిచారన్నారు. విజ్ఞాన శాస్త్ర విభాగంలో 'వెహికిల్ ప్రొటక్షన్ కవర్'ను ప్రదర్శించిన మహిత, గాయత్రి ప్రథమ స్థానంలో, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ విభాగంలో 'డ్రోన్ టెక్నాలజీ'ని నిత్య అశ్రయ, జ్యోత్స్న ప్రదర్శించి ప్రథమస్థానంలో నిలిలిచారన్నారు. రాణించిన విద్యార్థులను, గైడ్ ఉపాధ్యాయులు రాజమ్మ, సౌజన్య, జ్యోతి ప్రసన్న, మణిలను డీసీఓ శ్రీదేవి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు చేయాలి



ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

దేవనకొండ: ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, మండల కార్యదర్శి రవితేజ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక కళాశాల నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు విద్యారంగ సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు కావొస్తున్నా ఒక్క సమస్యను పరిష్కరించడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, ప్రకాష్, జయసూర్య, విద్యార్థులు పాల్గొన్నారు.

భూములకు రక్షణ కల్పించండి

కృష్ణగిరి: ప్రభుత్వం అసైన్‌మెంట్ ద్వారా లబ్ధిదారులకు ఇచ్చిన భూములను ఇతరులు స్వాధీనం చేసుకోకుండా రక్షణ కల్పించాలని ఎమ్మార్పీఎస్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ రమేష్ మాదిగ కోరారు. మంగళవారం కృష్ణగిరిలో తహసీల్దార్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. మాదాపురం గ్రామంలో అసైన్‌మెంట్ ద్వారా ఇచ్చిన భూములను కొందరు అక్రమిస్తున్నారన్నారు. జిల్లా అధ్యక్షుడు గిడ్డయ్య మాదిగ, తదితరులు ఉన్నారు.

విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌కు పదోన్నతి

ఆలూరు: ఆలూరులోని సచివాలయం -2 విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బీఎస్ శివప్రసాద్ ఏఈఓగా పదోన్నతి పొందారు. ఈ మేరకు మంగళవారం సచివాలయం-2లో సచివాలయ ఉద్యోగులు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది తదితరులు ఆయనను సన్మానించారు.

పింఛన్ల పంపిణీకి సిద్ధం కండి

తుగ్గలి : నవంబర్ నెల పింఛన్ల పంపిణీకి సంబంధించి ఈనెల 30వ తేదీనే సంబంధిత సిబ్బంది బ్యాంకు నుంచి సొమ్ము డ్రా చేసి పంపిణీకి సిద్ధంగా ఉండాలని ఎంపీడీఓ విశ్వమోహన్ సూచించారు. అక్టోబర్ 31న సెలవు దినం కావడంతో 30నే బ్యాంకుల నుంచి సొమ్ము డ్రా చేసుకుని అందుబాటులో ఉంచు కోవాలన్నారు. మండలంలో మొత్తం 7,619 పింఛన్లకు గాను రూ.3, 22,46000 విడుదల య్యాయని పేర్కొన్నారు.

31న ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవం

వెల్దుర్తి(కృష్ణగిరి): ఈ నెల 31న ఏఐటీయూసీ 104వ వ్యవస్థాపక దినోత్సవాన్ని విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగమద్దయ్య పిలుపునిచ్చారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో మంగళవారం మండల అధ్యక్షుడు మాధవస్వామి అధ్యక్షతన జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రిటిష్ కాలంలోనే పరిశ్రమల్లో, కర్మాగారాలలో కార్మికులకు యూనియన్లు ఏర్పాటు చేసి, అనేక ఆందోళన చేసి 44 చట్టాలను సాధించిన చరిత్ర ఏఐటీయూసీదేనన్నారు. కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు మౌలాలి, హరి, వివిధ సంఘాల నాయకులు అనిల్, రాఘవేంద్ర, షేక్ అబ్దుల్లా పాల్గొన్నారు.

పని భారంతో అనారోగ్యానికి గురవుతున్నాం

వెల్దుర్తి(కృష్ణగిరి): ప్రభుత్వం తమపై పని భారం మోపడంతో అనారోగ్యాలకు గురవుతున్నామని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ అనుబంధ సంఘాల రాష్ట్ర కార్యదర్శి లలితమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. పని భారం నుంచి ప్రభుత్వం ఉపశమం కల్పించాలని మంగళవారం ఆమె యూనియన్ సభ్యులతో కలిసి వెల్దుర్తిలోని ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీఓ లూక్‌కు వినతిపత్రం అందజేశారు. రోజురోజుకి పని భారం పెరుగుతూ మూడు, నాలుగు యాప్‌లతో సమయం సరిపోక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు.

అపార్‌లో సాంకేతిక సమస్యలను తొలగించండి

కృష్ణగిరి: విద్యార్థుల నమోదుకు సంబంధించి ప్రవేశపెట్టిన అపార్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయని, వీటిని వెంటనే పరిష్కరించాలని మంగళవారం యూటీఎఫ్ నాయకులు తహసీల్దార్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థుల పుట్టిన తేదీ, ఇంటి, తల్లిదండ్రుల పేర్లు తదితర వివరాలు అస్తవ్యస్తంగా ఉన్నాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సరైన అవగాహన లేక పుట్టిన తేదీలు నమోదు చేయలేదని, వీటిని వెంటనే పరిష్కారం చేసే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. యూటీఎఫ్ నాయకులు తాయప్ప, నాగరాజు, హసీనాబేగం, శివప్రసాద్ రెడ్డి, రాములు ఉన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు

ఆదోనిరూరల్: అర్హులైన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు పొందేలా చూడాలని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సూచించారు. ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం సాయంత్రం స్పెషల్ సమ్మరీ రివిజన్-2025కు సంబంధించి రాజకీయ పార్టీల రాజకీయ నాయకులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటరుగా నమోదు చేయించాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివరాముడు, ఎలక్షన్ ఉప తహసీల్దార్ గాయత్రీ తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించరా ?

- గ్రామసభ తీర్మానం లేకుండానే పనులు ఎలా చేపడతారు?
- సర్వసభ్య సమావేశంలో సర్పంచుల ఆవేదన



మాట్లాడుతున్న ఎంపీడీఓ గీతావాణి

ఆస్పరి: గ్రామ సభ తీర్మానం లేకుండానే కూటమి నాయకులు పల్లెపండుగ కింద మంజూరైన నిధులతో సీసీరోడ్లు, డ్రైనేజీ కాలువ పనులు చేపడుతున్నారని చిన్నహోతూరు, బిణిగేరి, తంగరడోణ, చిగిళి సర్పంచులు, ఎంపీటీసీలు హరిక్రిష్ణ, వెంకటేష్, శంకరమ్మ, రాధాక్రిష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ప్రొటోకాల్ పాటించడం లేదని అధికారుల తీరును తప్పుపట్టారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సుంకుర ఉమాదేవి అధ్యక్షతన మండల మీట్ నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మాట్లాడుతూ తాము వైఎస్సార్‌సీపీకి చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు అయినందున అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. గ్రామ సభ తీర్మాణాలు లేకుండానే కూటమి నాయకులు చెప్పిన విధంగా అధికారులు అవసరంలేని చోట్ల సీసీరోడ్లు, డ్రైనేజీ కాలువ పనులు చేపట్టడడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గ్రామ సభలకు ఎంతో ప్రాముఖ్యత ఇస్తున్నామని చెబుతున్నా ఆచరణలో ఏ మాత్రం జరగడం లేదన్నారు. చిగిళి గ్రామంలో అంబేడ్కర్ సర్కిల్ నుంచి తిప్పన్న తాత ఆలయం వరకు సీసీరోడ్లు, డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయాలని తాము గ్రామ సభ తీర్మానం చేస్తే అధికారులు ప్రజలకు ఉపయోగం లేనిచోట్ల కూటమి నాయకులు సూచనల మేరకు సీసీరోడ్లు, డ్రైనేజీ కాలువలకు భూమి పూజ చేశారని చిగిళి ఎంపీటీసీ రాధాక్రిష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు స్పందించిన ఎంపీడీఓ గీతావాణి గ్రామంలో జరిగే అభివృద్ధి పనులకు గ్రామ సభ తీర్మానం ఉండాలని, ఇక నుంచి అలా జరగకుండా చూస్తామన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు, ఎంపీటీసీలు, సర్పంచులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విరూపాక్షి

హాలహర్వి: మండలంలోని బిలేహాల్ గ్రామంలో సర్పంచ్ ఉలిగప్ప తల్లి సుంకమ్మ, నిట్రవట్టి గ్రామంలో గూళ్యం పెద్దమారెన్న, కురువ చిన్నమల్లికార్జున మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆలూరు ఎమ్మెల్యే బి.విరూపాక్షి మంగళవారం బాధితా కుటుంబాలను పరామర్శించారు. మృతదేహాలపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో వైఎస్సార్సీపీ మండల అధ్యక్షుడు రామ్‌రెడ్డి, నాయకులు, ఎంపీటీసీలు గోపాల్, గాదిలింగ, శ్రీనివాసులు, కృష్ణ, గంగాధర, తిమ్మప్ప, దిబ్బలింగ, బసవరాజు, రామయ్య, కార్యకర్తలు ఉన్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నరసింహులు

ఆలూరు: విద్యార్థులు ఆరోగ్య సూత్రాలు పాటించాలని అరికెర గ్రామం అంబేడ్కర్ గురుకుల బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ నరసింహులు సూచించారు. పాఠశాల ఆవరణలో మంగళవారం ఆరోగ్య కార్యకర్త లక్ష్మీబాయ్ ఆధ్వర్యంలో ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ భోజనానికి ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రంగా కడుక్కోవాలని తెలిపారు.

స్కూల్ కాంప్లెక్స్ నుంచి తొలగించొద్దు

హొళగుంద: ఇంగళదహాళ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను స్కూల్ కాంప్లెక్స్ నుంచి తొలగించొద్దని మద్దిలింగదహళ్లీ (ఎం.డీ హళ్లి) గ్రామ సర్పంచ్ సుధాకర్, ఇంగళదహాళ్ మాజీ ఎంపీటీసీ చంద్రన్న విద్యా శాఖాధికారులను కోరారు. మంగళవారం వారు మాట్లాడుతూ 1964 నుంచి పాఠశాల కొనసాగుతూ ఎంతో మందికి మంచి భవిష్యత్తు ఇచ్చిందన్నారు. ఈ పాఠశాల 7.69 ఎకరాల విస్తీర్ణం కలిగి ఉండి టీచర్లు, బాయ్స్ హాస్టల్ ఇతర అన్ని సదుపాయాలు కలిగి ఉందన్నారు. చుట్టూ పక్కల ఉన్న 9 పాఠశాలలకు ఇంగళదహాళ్ హై స్కూల్ చాలా కాలంగా స్కూల్ కాంప్లెక్స్‌గా ఉందని చెప్పారు. ఇలాంటి పాఠశాలను స్కూల్ కాంప్లెక్స్ నుంచి తొలగించాలనే ఆలోచన మంచిది కాదన్నారు.

వేదావతి నది పరిశీలన



నది వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఎస్ఈ బాలచంద్రరెడ్డి

హాలహర్వి: మండలంలోని గూళ్యం వద్ద గల వేదావతి నదిని మంగళవారం సాయంత్రం జలవనరులశాఖ ఎస్ఈ బాలచంద్రరెడ్డి, ఎల్ఎల్‌సీ ఏఈ శైలేశ్వర్‌రెడ్డి, డీఈ మహ్మద్‌షఫీ పరిశీలించారు. వేదావతి ప్రాజెక్టు గురించి స్థానిక అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అమృతాపురం వద్ద ఉన్న నదిని కూడా పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు పెద్ద ఎత్తున వేదావతి నది పొంగి ప్రవహించిందన్నారు. ఈ నీటిని స్టోరేజ్ చేసి, రైతులకు సాగు నీరు అందించేలా ప్రభుత్వానికి నివేదిస్తామని ఎస్ఈ చెప్పారు. వేదావతి నది వల్ల ముంపునకు గురయ్యే గ్రామాల వివరాలను కూడా సేకరిస్తున్నట్లు తెలిపారు.

అధ్వానంగా ఆదోని రోడ్డు



వందవాగిలి క్రాస్ సమీపంలో రోడ్డు అధ్వానంగా ఉండడంతో చెడిపోయిన ట్రాక్టరు

హొళగుంద: హొళగుంద-ఆదోని రోడ్డు అధ్వానంగా తయారై ప్రయాణం నరకంగా మారింది. రోడ్డుపై రాళ్లు రప్పలు తేలి, మోకాలి లోతు గుంతలు పడి ప్రమాదకరంగా ఉంది. ప్రధానంగా మారెమ్మ వంక నుంచి ఢణాపురం వరకు 27 కిలో మీటర్ల ప్రయాణం నరకాన్ని చూపిస్తుంది. రెండేళ్ల క్రితం రూ.65 కోట్లతో డబుల్ లైన్ రోడ్డు వేసెందుకు పనులు మొదలు పెట్టినా మధ్యలోనే నిలిచిపోయాయి. హెబ్బటం – నాగనాథన హళ్లీ రోడ్డు మధ్యలో అడుగు అడుగుకు మోకాలోతు గుంతలు పడ్డాయి. రోజులు గడుస్తున్నా అధికారులు కనీసం మరమ్మతు పనులు చేపట్టక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొటున్నారు.